

# వేటూరి సాహితీ ఝరి



తెలుగుచలనచిత్రచరిత్రలో తనకంటూ ఒక ప్రత్యేక అధ్యాయాన్ని సువర్ణాక్షరాలతో లిఖించుకున్న శ్రీ వేటూరి సుందరరామమూర్తి గారు, సినీరంగప్రవేశానికి ముందే ఎన్నో కవితలు, గేయాలు, గేయరూపకాలు, కథలు, వ్యాసాలు, సినీ సమీక్షలు, సీరియల్స్ వ్రాశారన్న విషయం అందరికీ తెలిసి ఉండకపోవచ్చు. ఆ రోజుల్లో వారి కలంపేర్లు కొన్ని - శుభశ్రీ, రామం, సరళ.. వేటూరిగారి సినిమాయేతర సాహిత్యాన్ని పాఠకులకి అందించడమే ఈ శీర్షిక ముఖ్యోద్దేశం. ఈ అంశాలని కౌముదికి అందించిన, పునర్ముద్రణకి అనుమతించిన వేటూరి రవిప్రకాష్(సుందరరామమూర్తిగారి పెద్ద కుమారుడు)గారికి కౌముది ధన్యవాదాలు తెలియచేస్తోంది.

## ఇంటర్వ్యూ ప్రివ్యూ

## – వేటూరి సుందరరామ్మూర్తి

(ఫిబ్రవరి 3, 1960 ఆంధ్రపత్రిక వారపత్రిక నుంచి)




బెజవాడ – గుంటూరు రోడ్డు మీద తుపాకి గుండులా దూసుకు పోతోంది మోటార్ బైక్. పరిసరం ప్రశాంతంగా ఉంది. చల్లగాలి సుఖంగా ఉంది. రాత్రి తొమ్మిదింటికి బెజవాడలో షాపింగ్ పూర్తి చేసుకుని రాజారావు శరవేగంతో గుంటూరు వస్తున్నాడు. మర్నాడు ఉదయం పోలీసు ఉద్యోగానికి అతనికి ఇంటర్వ్యూ.

రాజారావు షికారీలో ఆరితేరాడు. గుండెబలం కండబలం గలవాడు. వాడి చూపు, వేడి రక్తంగల ఘటం. ముక్త్యాల ప్రాంతం నట్టడవుల్లో గండు పులుల్ని మట్టుపెట్టి మటుమాయం చేసిన దిట్ట.

అలా శరంలా దూసుకుపోతున్న రాజారావుకు గభిక్కిన ఏదో గగ్గోలు వినిపించింది. చుట్టుపట్ల కలయచూశాడు. బైక్ పరిగెడుతూనే ఉంది. మార్గం నిర్మానుష్యంగా ఉంది. ఏమీ కనుపించలేదు.

ఈదురుగాలులు చెవిలో విసిరి కొడుతున్నాయి. ఆ ఒంటరితనం అతన్ని భయపెట్టబోయి తెల్లబోయిందా అన్నట్లు మసక

వెన్నెల అంతటా ఆకట్టుకుంది. రోడ్డుమీద తనముందు అరఫర్లాంగు దూరంలో ఒక కారు అమితవేగంగా పోతోంది.

ఈసారి మళ్ళీ అలికిడి వినిపించింది. భయంకరమైన అరపేదో వికారంగా వినిపించింది. అది తన ముందున్న కారులోంచే వస్తున్నట్లు అనిపించింది. పసిగట్టిన రాజారావు లాగు జేబులో తుపాకి తడిమి చూసుకున్నాడు. ఆ గగ్గోలు ఏదో స్త్రీ కంఠం, స్త్రీ ఆర్తనాదం, రాజారావుకు ఉద్వేగం ఎక్కువైంది. దాంతో వేగం హెచ్చించాడు.

క్షణం వితర్కించి 'అవును, బహుశా ఆ కారులో ఎవరో దుండగులు స్త్రీని అపహరించి బలాత్కారం చేస్తున్నారు.' అనుకున్నాడు రావు. అరపు మళ్ళీ వికృతంగా వినిపించింది. రెచ్చిపోయి వేగం హెచ్చించేశాడు రావు. ముందుకారు మరింత వేగంగా దూసుకుపోతోంది. కారును దాటి పోవాలని సైడ్ కోసం హార్న్ చేశాడు. అట్నించి వచ్చి రోడ్డు కడ్డంగా ఖణాయిస్తే దక్కిస్తూ దుండగీడు ఆగిపోవలసిందే... ఇలా ఊహించాడు.

కారు వ్యక్తి సైడ్ ఇవ్వలేదు. రావుకి అనుమానం ధృవపడింది. కారుదాటి దారికడ్డంవచ్చి ఆ కిరాతకుణ్ణి పట్టేసుకోడం ఎలా? అతని మోటార్ బైక్ రోడ్డుపై ఉక్కిరి బిక్కిరి అయింది.

ఇంతలో మార్గంలో మలుపు వచ్చింది కారు మలుపు తిరుగుతోంది. ఇదే సమయమని పక్క సందుగా రివ్వున దూసుకు పోయాడు రావు. సరాసరి ముందుకు దౌడాయించి రోడ్డుకడ్డంగా బైక్ నిలబెట్టి కారును ఆపివేశాడు.

రోషంగా, పౌరుషంగా కారుదగ్గరికి వచ్చాడు రావు. కారులోంచి తనాబీలా బైటికొచ్చిన వ్యక్తి యుద్ధమల్లుడిలా కుప్పించి ముందుకు దూకాడు. జబ్బకొద్దీ ధనాయించి దెబ్బతీశాడు. మూడుగజాల దూరంలో పడ్డాడు రావ్. దిమ్మతిరిగిపోయి కసిబుసలు కొట్టింది అతనికి. తమాయించుకుని చివాలున లేచి బలంకొద్దీ గింగిరాలు తిరిగేటట్టు గూబ గుయ్ మనపించాడు కారు వ్యక్తికి.

కారులో గోల ఇంకా జరుగుతూనే వుంది. బాహాబాహీగా ఇక లాభంలేదని రావు కారుమనిషి మోకాలు కీలుమీద తుపాకి గురిపెట్టి ప్రయోగించాడు. ఎండెన్ గుండు తగిలిన ఆకాశసౌధంలా, చిన్న 'క్లూ'తో కథలో పేల్చిన 'సస్పెన్సు'లా దభాల్న కూలిపోయాడు దుండగీడు.

రాజారావు కాలునిలదొక్కుకుని ఆదుర్దాగా కారుదగ్గరికి వెళ్ళి చూశాడు. మసక చీకట్లో అలికిడేం కనిపించలేదు. ఆక్రితం క్షణం వరకు వినిపించిన అల్లరి, ఆర్తనాదం ఆగిపోయాయి. కారులో మరెవ్వరూ వ్యక్తులున్నట్లు కనిపించలేదు. ధైర్యంచేసి తలుపు తీసి చూశాడు. రెండు పెట్టెలు మాత్రం వున్నాయి. మనుష్యులు... తను అనుకున్న స్త్రీ... ఎవరూ లేరు. ఆదుర్దా ఎక్కువై పోయింది. అయోమయమైపోయింది.

ఇంతలో... 'ఆలిండియా రేడియో... మీరింతవరకు 'కారులో హత్య' డిటెక్టివ్ నాటిక విన్నారు. ఇందులో పాల్గొన్న వారు...'

నిర్ఘాంతపోయాడు రావు. నిర్విణ్ణుడై స్తంభించిపోయాడు. అప్రయత్నంగా కొరుక్కున్న నాలిక మంటపుట్టనే లేదు. బుద్ధి ఫట్టీకొట్టి చిత్తయిపోయాననుకున్న రాజారావు చేసిన పనికి బాధతో భయపడి పోయాడు. తానో పేద్దకొండతవ్వి పట్టిన ఎలుకలా ఎదర తుప్పలోపడి కనిపించాడు దెబ్బతిన్న మనిషి!

ఆ క్షణంలో ఏమిటో, ఎలాగో, యేం చేయాలో రావుకు తోచలేదు.

హఠాత్తుగా ఆ తికమకలో రేచులా ఒక జీప్ కారు వచ్చి ఆగింది. అందులోంచి గబగబా పోలీసు పటాలం ఒకటి దిగి చుట్టూ వచ్చి కమ్ముకున్నారు.

రావు వణికిపోయాడు. పోలీసులు కొందరు కారంతా వెతుకుతున్నారు. రావును దబాయించి 'ఎవరు నువ్వు? ఏమిటిది ? ఎక్కడ ఈ కారులో వచ్చిన వ్యక్తి ?' అని అడిగాడు పోలీసు అధికారి.

మూల కీలువిరిగి పడివున్న వ్యక్తిని చూపించాడు రావు.

చేసిన నేరానికి వెంటనే తనకే సంకెళ్ళు పడతాయనుకున్న రాజారావు తనకళ్ళను తనే నమ్మలేకపోయాడు. కుప్పకూలి పడివున్న కారుమనిషి చేతికి తటాలున బేడీలు వేశారు పోలీసులు.

'ఇక్కడేం జరిగింది ?' పోలీసు అధికారి ప్రశ్నించాడు. జరిగిన కథ వివరించాడు రాజారావు.

'ఎక్కడికి వెడుతున్నారీ అర్ధరాత్రి?' మళ్ళీ ప్రశ్నించాడు అధికారి. గుంటూరు ఇంటర్వ్యూ సంగతి చెప్పాడు రావ్.

'రైటో... ముందు స్టేషనుకు నడవండి' అన్నాడు ఇన్ స్పెక్టరు.

'ఏమిటిది ఇన్ స్పెక్టర్... అంతా అయోమయంగా వుంది' రావ్ ప్రశ్నించాడు.

ఖైదీతో సహా పటాలంతో జీప్ వాన్ కదిలింది. మోటార్ బైక్ మరో పోలీస్ జవాన్ తెస్తున్నాడు. ఇన్ స్పెక్టర్ చెప్పాడు "ముందు మీరు కూడా స్టేషన్ కు వచ్చి స్టేట్ మెంటు ఇవ్వాలి. తరువాత మీరువెళ్ళవచ్చు. వీడు మాకళ్ళల్లో కారంకొట్టి ఆర్నెల్లుగా యీ చుట్టుపట్ల చోరీలు చేస్తున్న బడాచోర్ కేడీ... గూండా... సినిమాహాల్లో రెండువేల రూపాయలు కొట్టేసి, పార్క్ చేసివున్న మునిసిపల్ కమీషనర్ కార్లో ఉడాయించాడని తెలిసి వెంబడించాం. దొంగనోట్లు అచ్చువేయడం వీడి వృత్తి. సింపిల్ రాస్కెల్.. మొత్తానికి భలే చిత్ర సంఘటన మీరు వీణ్ణి పట్టుగోటం... మీకు చాలా థ్యాంక్స్'

అప్రయత్నంగా 'ఏమిటిదంతా ముద్దాయిని పెద్దమనిషినయిపోయాను' అన్నాడు సంభ్రమంతో రావ్.

'మరేంలేదు. రేపు మీరు పోలీస్ ఉద్యోగానికి ఇంటర్వ్యూకు వెడుతున్నారు కదూ.... ఇది ఇంటర్వ్యూ 'ప్రీవ్యూ' అని క్షణం ఆగి బిగ్గరగా నవ్వి మీకీమాటలిలా అర్థంకావటం కష్టం. మరివస్తా నమస్తే...' అని ఠాణాలోకి నడిచాడు ఇన్ స్పెక్టర్.

మర్నాడు ఇంటర్వ్యూలో యిన్ స్పెక్టర్ కూడా ఒక పరీక్షకుడే. ఈమాటలు ఒక కాన్ స్టేబుల్ రావు చెవిలో ఊదాడు. స్టేట్మెంట్ ఇచ్చి బయటికి వస్తుంటే... మరోడు తెచ్చి మోటార్ బైక్ అందించాడు.

ఈ మాటలు విన్న రాజారావు ఆ మోటార్ బైక్ ఎక్కి జరిగిందానికి జరగబోయేదానికి ఒక్కసారి ఆశ్చర్యంలో మునిగిపోయి గుంటూరు ఇంటర్వ్యూలో పైకి తేలాడు.

★★★

**COMMENTS**